క్లుప్తంగా

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం(ప్రకాష్‌నగర్) జీవీఎంసీ ఉన్నత పాఠశాల సమీపాన గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ కళాశాలలో ఇంగ్లిష్, తెలుగు మీడియంలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో అడ్మిషన్లు కల్పిస్తున్నారు. ఇక్కడ చేరే విద్యార్థులు ఏడాదికి రూ.2,450 (సైన్స్ స్టూడెంట్స్), రూ.1500 (ఆర్ట్స్ స్టూడెంట్స్) నామ మాత్రం ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఈ కళాశాలలో చేరే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, రికార్డులన్నీ ఉచితంగా అందిస్తారని, మధ్యాహ్న భోజనం ఉంటుందని తెలిపారు. అలాగే జేఈఈ, నీట్ కు ఉచితంగా స్టడీ మెటీరియల్‌తో పాటు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. బస్‌పాస్ సౌకర్యం, విశాలమైన క్రీడా మైదానం ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు 99859 82477 నంబర్‌లో సంప్రదించాలని కళాశాల ప్రిన్సిపాల్ ప్రకటనలో తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నేడు మహాధర్నా

మల్కాపురం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకుల ఆధ్వర్యంలో నగరంలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మంగళవారం మహాదీక్ష చేపట్టనున్నట్లు ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మంత్రి రాజశేఖర్, భోగవల్లి నాగభూషణం ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగే మహాధర్నాలో కార్మికులు పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు.

కేంద్రం వైఖరిపై ముస్లింల నిరసన



చేతికి నల్ల రిబ్బన్లతో నిరసన తెలుపుతున్న ముస్లింలు

విశాఖ విద్య: కేంద్ర ప్రభుత్వం ముస్లింల పట్ల అనుసరిస్తున్న వైఖరిపై మైనార్టీ వర్గాల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. రంజాన్ పర్వదినం సందర్భంగా ఎస్‌పీడీ సెంటర్‌లోని మసీదులో ముస్లింలు ప్రార్థనల్లో భాగంగా చేతికి నల్ల రిబ్బన్ కట్టుకుని నిరసన తెలిపారు.

రామాయణ పాటలపై ప్రవచనాలు



ప్రవచిస్తున్న ఆచార్య మలయవాసిని

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో వసంత నవరాత్రుల సందర్భంగా సోమవారం సాయంత్రం రామాయణ ప్రవచనాలు ప్రారంభమయ్యాయి. మహిళల రామాయణపు పాటలపై నాలుగు రోజులు ప్రసంగాలు జరగనున్నాయి. తొలి రోజు ఆచార్య కోలవెన్ను మలయవాసిని మహిళల రామాయణపు పాటల వైశిష్ట్యాన్ని, జానపద రామాయణాల గురించి అనేక విషయాలు వివరించారు. రామాయణ గ్రంథాల్లో లేని విషయాలు, జానపద స్త్రీలు తమ ఆలోచనలు, నమ్మకాలకు అనుగుణంగా భావించి పాడుకున్నారని, ఈ కథలు చాలా ఆసక్తికరంగా ఉండటమే కాకుండా పాడుకోడానికి వీలుగా ఉంటాయన్నారు. రాముడు, సీత, లక్ష్మణుడు, హనుమంతుడు పాత్రలను తమ కుటుంబ సభ్యుల్లా భావించి ఆత్మీయంగా పాడుకున్నారని చెప్పారు. ప్రవచన కర్తను పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ సత్కరించారు.

36 మందికి జాతీయ రత్న ఉగాది పురస్కారాలు



నృత్య ప్రదర్శనతో అలరిస్తున్న చిన్నారులు

సీతంపేట: దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ, విశాఖ రత్న కళాపరిషత్ సంయుక్తంగా సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జాతీయ రత్న ఉగాది పురస్కారాల ప్రదాన కార్యక్రమం నిర్వహించాయి. సంస్థ వ్యవస్థాపకుడు పి.ఎ.భాస్కరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులు పైడా కృష్ణప్రసాద్, కంచర్ల అచ్యుతరావు వివిధ రంగాల్లో విశేష సేవలందించిన 36 మందిని పురస్కారాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు ప్రదర్శించిన సంప్రదాయ, శాస్త్రీయ నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ఆచార్య వి.బాలమోహన్‌దాస్, దుగ్గువలస దివాకర్, సినీ నటుడు ప్రసన్నకుమార్, సింగంశెట్టి సత్యనారాయణ, సన్ మూర్తి, కెంబూరి చంద్రమౌళి, ఎల్.ఆర్.కృష్ణబాబు పాల్గొన్నారు.

సింహాచలం స్టేషన్‌లో త్వరలో ప్రీ పెయిడ్ సర్వీస్



- ఆటోలు, ట్యాక్సీల ఏర్పాటుకు సన్నాహాలు
- స్థల నిర్ధారణ చేసిన అధికారులు, పోలీసులు
- ఆటో డ్రైవర్లు, ప్రయాణికుల హర్షం



సింహాచలం రైల్వే స్టేషన్

గోపాలపట్నం: సింహాచలం రైల్వేస్టేషన్‌లో ప్రీ పెయిడ్ ఆటో, ట్యాక్సీ సర్వీస్ ఏర్పాటుకు గోపాలపట్నం పోలీసులు, రైల్వే అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఏర్పాటు అటు ప్రయాణికులకు, ఇటు ఆటో డ్రైవర్లకు కూడా బాగుంటుందని ఇరు వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి.



ప్రీ పెయిడ్ కౌంటర్ ఏర్పాటు చేసేది ఇక్కడే..

అధికారుల పరిశీలన

సింహాచలం రైల్వే స్టేషన్ అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో అందుకు తగిన విధంగా అధికారులు నిర్ణయాలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా ఇక్కడ ప్రీ పెయిడ్ ఆటో, ట్యాక్సీ సర్వీసులు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు గోపాలపట్నం సీఐ గొలగాని అప్పారావు, రైల్వే అధికారులు సంయుక్తంగా పరిశీలించారు. ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేలా కౌంటర్ ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని నిర్ధారించారు. టికెట్ బుకింగ్ కౌంటర్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో కంటైనర్ ఏర్పాటు చేసి, అందులో ప్రీ పెయిడ్ బుకింగ్ కౌంటర్ ఏర్పాటు చేసేందుకు రైల్వే అధికారులు, పోలీసులు నిర్ణయించారు. స్టేషన్ నుంచి బయటికి వచ్చిన వెంటనే ప్రయాణికులకు అందుబాటులో ఉండే విధంగా ఈ కౌంటర్ ఏర్పాటు చేస్తున్నారు. అక్కడ టోకెన్ తీసుకుని ఆటో వద్దకు వచ్చి వెళ్లాల్సి ఉంటుంది.

గాజువాకకు గిరాకీ

సింహాచలం రైల్వే స్టేషన్ నుంచి గాజువాక వెళ్లే టికెట్ సర్వీస్ ఎక్కువగా ఉంటుంది. తరువాత స్థానంలో శుక్ర, శనివారాల్లో సింహాచలం వెళ్లేందుకు గిరాకీ ఉంటుంది. ప్రీ పెయిడ్ విధానంతో బుకింగ్‌కు ప్రయాణికుల ఆసక్తి ఏమేరకు ఉంటుందో చూడాల్సి ఉందని చెబుతున్నారు.



సింహాచలం రైల్వే స్టేషన్ వద్ద ఉన్న ఆటోలు

ఇది మంచిదే..



ప్రీ పెయిడ్ ఆటో సర్వీస్ పెట్టడం మంచిదే. గిరాకీలు పెరుగుతాయి. అయితే సర్వీసు ధర విషయంలో ఇక్కడి ఆటో డ్రైవర్ల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోవాలి.

–సూరిశెట్టి వెంకటరమణ, ఆటో డ్రైవర్, సింహాచలం రైల్వేస్టేషన్

ప్రయాణికులకు మేలు



ప్రీ పెయిడ్ ఆటో సర్వీస్ వల్ల ప్రయాణికులకు ఎంతో మేలు కలుగుతుంది. ఈ సర్వీసు ద్వారా ప్రయాణికుల ప్రయాణానికి భద్రత ఉంటుంది. అయితే టికెట్ సర్వీసులకు అలవాటు పడినవారు ఈ సర్వీసును ఎలా స్వాగతిస్తారో చూడాలి.

– కోరుకొండ నానాజీ, లక్ష్మీనగర్, గోపాలపట్నం

ప్రయాణికుల భద్రత కోసం..

ప్రయాణికుల భద్రత కోసం ప్రీ పెయిడ్ ఆటో, ట్యాక్సీ సర్వీసులకు సన్నాహాలు చేస్తున్నాం. ఇందులో ఆటో డ్రైవర్ల వివరాలు, ఆటోల వివరాలు పొందుపరుస్తాం. రవాణా శాఖ రూపొందించిన విధంగా ధరలు నిర్ణయిస్తాం. ఈ ప్రీ పెయిడ్ కౌంటర్ ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణలో ఉంటుంది.

–గొలగాని అప్పారావు, గోపాలపట్నం సీఐ

భక్తిశ్రద్ధలతో రంజాన్



మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు



పారిశ్రామిక ప్రాంత ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉపవాసాలు, ప్రార్థనలు, దానధర్మాలతో నెలరోజుల పాటు నియమనిష్ఠలతో గడిపిన వారంతా ఈద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కోరమాండల్ వద్ద ఈద్గా, గోపాలపట్నం మసీదులకు వేలాదిగా తరలివెళ్లిన ముస్లింలు ప్రార్థనలు చేశారు. నిరుపేదలకు ఆర్థిక సాయం అందించారు. చిన్నా, పెద్ద ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. కొత్తపాలెం మసీదులో వేలాదిమంది ప్రార్థనలు చేశారు.

- గోపాలపట్నం/మల్కాపురం

కోలాట శిక్షణ తరగతులు ప్రారంభం



శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్న సినీ నటుడు ప్రసన్నకుమార్

మల్కాపురం: శ్రీ రాజరాజేశ్వరి కోలాట నాట్యకళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 59వ వార్డు నక్కవానిపాలెం వద్ద కోలాట నృత్య శిక్షణ తరగతులను ప్రముఖ సినీ నటుడు ప్రసన్నకుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దేవుని సన్నిధానంలో మహిళల కోలాట ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంటోందన్నారు. కోలాటం వల్ల మానసిక ఆనందం, ఆరోగ్యం సొంతమవుతుందన్నారు. సెన్సార్ బోర్డ్ మాజీ సభ్యురాలు, సామాజిక సేవా కార్యకర్త పి.శేషమాంబ మాట్లాడుతూ కోలాట శిక్షణ ఇస్తున్న గురువు లోవ రాజేశ్వరిని, నేర్చుకుంటున్న మహిళలను అభినందించారు. ఎన్ఎస్ఎస్ నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, జిల్లా యాదవ మహిళా ప్రతినిధి తోనంగి వెంకటరమణియాదవ్ తదితరులు రాజేశ్వరిని సత్కరించారు.

వాణిజ్య సంస్థలు, మల్టీప్లెక్స్‌ల్లో పార్కింగ్ ఉచితం

- షాపింగ్ బిల్/సినిమా టికెట్ చూపిస్తే చాలు
- 'క్రో'ఏపీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న గొర్లె శ్రీనివాసనాయుడు

డాబాగార్డెన్స్: వాణిజ్య సంస్థలు, మాల్స్, మల్టీప్లెక్స్‌ల్లో పార్కింగ్ రుసుం వసూళ్లపై పురపాలన, పట్టణాభివృద్ధి శాఖ(ఎంఏయూడీ) ఉత్తర్వుల్ని ఈ నెల 1 నుంచి తప్పనిసరిగా అమలు చేయాలని కన్జ్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్(క్రో) ఏపీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసనాయుడు తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాజా ఉత్తర్వుల మేరకు మాల్స్, మల్టీప్లెక్స్‌ల్లో షాపింగ్ బిల్, సినిమా టికెట్ చూపిన వారి నుంచి ఎలాంటి పార్కింగ్ రుసుం వసూలు చేయడానికి వీల్లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ మోడల్ బిల్డింగ్ బైలాస్-2016 ఆధారంగా రాష్ట్రంలోని భవన నిర్మాణ కార్యకలాపాలకు వర్తించే ఏపీ బిల్డింగ్ రూల్స్-2017ను ప్రభుత్వం జారీ చేసిందన్నారు. అందులో పేర్కొన్నట్లు భవనాల్లో పార్కింగ్ స్థలం తప్పనిసరన్నారు. రాష్ట్రంలోని మాల్స్, మల్టీప్లెక్స్‌లు తదితర వాటి నుంచి పార్కింగ్ రుసుం వసూలుకు వ్యతిరేకంగా ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయన్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా పార్కింగ్ దుర్వినియోగ నిరోధానికి పురపాలక శాఖ తాజా మార్గదర్శకాలు ప్రతిపాదించినట్లు తెలిపారు. తొలి అర్ధగంట వరకు పార్కింగ్ ఉచితమని, 30 నిమిషాలు పైబడి గంట వరకు వాహనం పార్కింగ్ చేసిన వ్యక్తి ఆ మాల్లో ఎంతైనా బిల్లింగ్ చేసినట్లు రసీదు చూపితే అది కూడా ఉచితమేనన్నారు. గంటకు పైగా పార్కింగ్ చేసినవారు సంబంధిత మాల్/మల్టీప్లెక్స్‌లో షాపింగ్ చేసినట్లు రుజువు చూపించకపోతే పార్కింగ్ రుసుం వసూలు చేయవచ్చన్నారు. షాపింగ్ బిల్లు, సినిమా టికెట్ చూపిస్తే ఉచిత పార్కింగ్ సదుపాయం కల్పించాలన్నారు. ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న ఈ ఆదేశాలు ధిక్కరిస్తే చర్యలు తీసుకోవడం తప్పదన్నారు. సమావేశంలో సంస్థ జాతీయ కార్యదర్శి మూల వెంకటరావు, ఏపీ స్పోక్స్ పర్సన్ కరణంరెడ్డి నరసింగరావు, కార్యదర్శి రాజా, జాతీయ కార్యవర్గ సభ్యులు దీపక్ వర్మ, సునీల్, లోగిన గణేష్, గోపి, శశి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పార్కుకు వెళ్తున్నారా.. ఫీజు కట్టాల్సిందే

- ఇకపై గుర్తింపు కార్డు ఉన్నవారికే అనుమతి
- అల్లూరి పార్కులో నేటి నుంచి అమలు
- స్థానికుల విస్మయం



అల్లూరి పార్కు



ఫీజు కట్టాలని ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలోని అల్లూరి సీతారామరాజు పార్కులో గుర్తింపు కార్డు ఉన్నవారికే ఇకపై ప్రవేశం ఉంటుంది. నెలసరి ఫీజు చెల్లించిన వారికి పార్కు అభివృద్ధి కమిటీ వారు ఎంట్రీ కార్డు జారీ చేస్తారు. ఆ కార్డు చూపించిన వారికి మాత్రమే పార్కు లోపలికి అనుమతి ఉంటుంది. ఏప్రిల్ 1 నుంచి ఇది అమల్లోకి వస్తుందని అల్లూరి పార్కు ముందు అసోసియేషన్ ప్రతినిధులు ఫ్లెక్సీ పెట్టారు.

నెలకు రూ.150

ఎంట్రీ ఫీజుగా నెలకు రూ.150, ఏడాదికైతే రూ.1500 చెల్లించాలని పేర్కొన్నారు. ఐడెంటిటీ కార్డు కొనుగోలు చేసిన వారిలో తల్లిదండ్రులతో పాటు వచ్చే ఐదేళ్లలోపు చిన్నారులను ఫ్రీగానే అనుమతిస్తామని, పార్కులోకి మొబైల్ ఫోన్లు పట్టుకొని వచ్చి, గేమ్స్ ఆడేవారిని అనుమతించబోమని నిబంధనలు పెట్టారు. ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేసిన పార్కులోకి డబ్బులు కడితేనే కానీ, రానివ్వమని ప్రకటించటమేంటని స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పార్కు అభివృద్ధి కోసం కాలనీ అసోసియేషన్ భాగస్వామ్యం హర్షణీయమే అయినా.. ఇలా పార్కులోకి సందర్శకులు వచ్చి సేద తీరే వీల్లేకుండా, కమర్షియల్ చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

చందన అలంకరణలో తిరుమలేశుడు



తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో చందన అలంకరణలో వెంకన్న

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో సోమవారం తిరుమలేశునికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి చందన అలంకరణ చేపట్టారు. చందన అలంకరణలో స్వామిని దర్శించుకున్న భక్తులు పులకించిపోయారు.

అలరించిన శ్రీరామదాసు కీర్తనలు

ఎంవీపీకాలనీ: లలిత సప్తస్వరాల సభ్యులు ఆలపించిన శ్రీరామదాసు, త్యాగరాజు కీర్తనలు అలరించాయి. ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని శ్రీ వేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో వసంతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం లలిత సప్తస్వరాల సభ్యులచే సంగీత విభావరి నిర్వహించారు. బ్రోచేవారు ఎవరు, పలుకే బంగారమాయెలే, సీతారామ కల్యాణ వైభోగం వంటి భక్తిరస గీతాలతో వారు అలరించారు. భక్తులు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్వేగం..ఉద్విగ్నం

- పదవీ విరమణ సభలో కంటతడి పెట్టిన ఉద్యోగులు
- భారంగా వీడ్కోలు



స్టీల్‌ప్లాంట్‌లో పదవీ విరమణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారి

ఉక్కునగరం: సాధారణంగా ఉద్యోగులు రిటైర్‌మెంట్‌కు ఒకటి రెండేళ్ల ముందు నుంచే సంసిద్ధమవుతారు. ఉద్యోగ విరమణ తర్వాత ఏం చేయాలి.. ఎలా ఉండాలి... ఎలా గడపాలి అనే ప్రణాళిక రచించుకుంటారు. అదే స్వచ్ఛంద ఉద్యోగ విరమణ (వీఆర్ఎస్) అయితే కేవలం నెలన్నర ముందు దరఖాస్తు చేయాలి. అంత తక్కువ వ్యవధిలో ఉద్యోగులు భవిష్యత్తు ప్రణాళిక రచించుకోవడానికి సమయం ఉండదు. అదే పరిస్థితి ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్‌లో నెలకొంది. స్టీల్‌ప్లాంట్‌ను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల సంఖ్య తగ్గించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా వీఆర్ఎస్ ప్రకటించింది.

కోతలతో సంసిద్ధం

ఉక్కు యాజమాన్యం గతేడాదిగా సక్రమంగా జీతాలు చెల్లించకపోవడంతో పాటు హెచ్ఆర్ఏ నిలిపి వేయడం, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ ఎత్తేయడం, ఇన్సెంటివ్ కనీస స్థాయికి తగ్గించడం వంటి చర్యలకు దిగడంతో ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. ఇలా ఎన్నాళ్లు నెట్టుకు రావాలో తెలియని పరిస్థితిలో భవిష్యత్తు గురించి కూడా ఆలోచించకుండా వీఆర్ఎస్‌కు పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేశారు. ఇలా 1613 మంది దరఖాస్తు చేసుకోగా అందులో సుమారు 248 మంది ఉపసంహరించుకున్నారు.

కొంత మంది దరఖాస్తులను యాజమాన్యం తిరస్కరించింది. చివరకు 1126 మంది వీఆర్ఎస్‌కు ఆమోదం తెలిపింది. అలా రిటైర్ అయిన వాళ్లకు నిర్వహిస్తున్న సత్కార కార్యక్రమాల్లో కొంతమంది భావోద్వేగానికి గురైతే మరికొంత మంది కన్నీళ్లు ఆపుకోలేకపోయారు. ఉద్యోగులను వదిలి వెళ్తున్న వీఆర్ఎస్ ఉద్యోగులు బాధ్యతల అప్పగింతలు, కుటుంబ సభ్యులతో పలకరింపులు ఇలా ఎక్కడ చూసినా ఉద్విగ్న వాతావరణం కనిపించింది. రేపటి నుంచి తాము ఏం చేయాలి... భవిష్యత్తు ఏంటనే దిగులుతో ఉన్నవారే ఎక్కువగా కనిపించారు. కాగా పదవీ విరమణ కార్యక్రమం అనంతరం ప్లాంట్ నుంచి బయటకు వచ్చిన వారిని తమ కుటుంబ సభ్యులు సత్కరించారు. మరికొంత మంది ఓపెన్ టాప్‌లో ఊరేగుతూ ఇంటికి చేరుకోవడం కొసమెరుపు.

వైభవోపేతంగా భావనా రుషి కల్యాణం



సీతంపేటలో నిర్వహిస్తున్న భద్రావతి సమేత భావనా రుషి స్వామి కల్యాణం

సీతంపేట: సమస్త సృష్టికే వస్త్రాలను సృష్టించి ఇచ్చిన శ్రీభద్రావతి సమేత భావన రుషి స్వామి వారి కల్యాణ మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీభక్త మార్కండేయ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం సీతంపేటలో నిర్వహించిన కల్యాణ మహోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొని తరించారు. అఖిల భారత పద్మ బ్రాహ్మణ పురోహిత సంఘం గౌరవాధ్యక్షుడు, రాజమహేంద్రవరానికి చెందిన బ్రహ్మర్షి ఆమంచి ఆంజనేయ గురుస్వామి నేతృత్వంలో వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. అనంతరం జరిగిన అన్నసమారాధనలో సుమారు 5 వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. సాయంత్రం మేళతాళలతో భద్రావతి సమేత భావనా రుషి స్వామి ఉత్సవ మూర్తుల ఊరేగింపు వైభవంగా జరిగింది. కార్యక్రమంలో శ్రీభక్త మార్కండేయ పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు గుదే రాజు, ప్రతినిధులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత కూచిపూడి నృత్య శిక్షణ తరగతులు ప్రారంభం

డాబాగార్డెన్స్: వేసవి శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా పాతనగరంలోని స్వామి వివేకానంద సంస్థలో నాట్యదీపిక కూచిపూడి అకాడమీ వ్యవస్థాపకురాలు ఎల్. ఇంద్రాణి నరేంద్ర ఆధ్వర్యంలో ఉచిత కూచిపూడి నృత్య శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు మాట్లాడుతూ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కూచిపూడి అకాడమీ వ్యవస్థాపకురాలు ఇంద్రాణి నరేంద్ర మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి కూచిపూడి నృత్యం ప్రత్యేకం అన్నారు. ఏకాగ్రత..భక్తి శ్రద్ధలతో నృత్యాన్ని నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సంస్థ మహిళా సభ్యులు ఉమాదేవి, కనకమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అవయవదాతకు ఘన నివాళి



సీతమ్మ చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: బ్రెయిన్ డెడ్ అవడంతో అవయవదానం చేసి నలుగురికి పునర్జన్మ ఇచ్చిన మాతృమూర్తి స్వర్గీయ గిన్ని సీతమ్మ అని గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పలనాగిరెడ్డి అన్నారు. భెల్ (హెచ్‌పీవీపీ) విశ్రాంత ఉద్యోగి గిన్ని అప్పారావు భార్య గిన్ని సీతమ్మ పెద్దకర్మను సోమవారం పిలకవానిపాలెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రెయిన్ డెడ్ అయిన సీతమ్మ అవయవాలను దానం చేయడానికి కుటుంబ సభ్యులు ముందుకు రావడంతో నలుగురికి పునర్జన్మ లభించిందన్నారు. ఆమె కుటుంబ సభ్యులను అభినందించారు. ప్రతీ ఒక్కరు సీతమ్మ కుటుంబ సభ్యుల్లా ఆలోచించాలని కోరారు. కార్యక్రమంలో సీతమ్మ కుటుంబ సభ్యులు జి.ఎస్.ఎన్.రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, భెల్ యూనియన్ ప్రతినిధి జె.రాము, శ్రీను, చిన్నా, రమణ, సంస్థ సెక్యూరిటీ అధికారులు వర్మ, ఐ.ఎస్.రాజు, శ్రీనివాస్, త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

మది దోచిన మధుర గీతాలు



ఇళయరాజా పాటలను ఆలపిస్తున్న కళాకారులు

డాబాగార్డెన్స్: స్వర రాగ సుధ అధ్యక్షుడు నేరెళ్ల రమేష్ నేతృత్వంలో స్థానిక అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మేస్ట్రో ఇళయరాజా స్వర పరచిన గీతాలతో సోమవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆద్యంతం అలరించింది. కడలి, రాధ పాడిన 'ఓ ప్రియా ప్రియా.., రమేష్, రంజితల పట్టి తెచ్చానులే.., మెలోడీ సత్యనారాయణ, భాగ్యలక్ష్మిల కలయా నిజమా..., ఎమ్మెస్ మాధవ్, మణిల ఎదలో తొలి వలపే.. ఎస్ఎస్ రావు, సీవీ రాజేశ్వరి ఆలపించిన నీవేగా నా ప్రాణం.. అవినాష్, సుజాతల చలీ చలీ నా కొక్కొరకో, దేవరాజ్, మాధవీలత చిరు గాలి వీచెను.. తదితర పాటలు రస హృదలను రంజింపజేశాయి. కీబోర్డ్ ప్లేయర్ సోమేష్ బృందం సంగీత నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో లక్ష్మీస్వరూప వ్యాఖ్యానం అలరించింది. కార్యక్రమంలో కళారంగ ప్రతినిధి చెన్నా తిరుమలరావు, తదితరులు పాల్గొన్నారు.